**కథ :**

దభేల్మని పిడుగుపడింది.

అదెక్కడ పడిందోగానీ నా నెత్తినే పడ్డట్టనిపించింది నాకు.

తల్చుకునే కొద్దీ అప్పిగాడిమీద పీకలమొయ్యే కోపం వస్తోంది. దౌర్భాగ్యుడు, పోనీ, వాడికంటే బుర్రలేదు నా బండికో? కొని రెండళ్ళైనా కాలేదింకా - ట్రబులిచ్చేసింది - దిక్కుమాలిన సంత.

మాది రాజమండ్రి అయినా చవగ్గా దొరికిందన్జెప్పి కొంతమూర్లో స్థలం కొన్నారు నాన్నగారు. ఇప్పటివరకూ ఇంటిపని సజావుగానే సాగింది. ఇదిగో, గుమ్మాలూ వగైరాల కలపదగ్గర వచ్చింది పేచీ. మొదట్నుండీ వెనకనే తిరిగి తనదగ్గరే కలపంతా కొనమని పోరిన అప్పిగాడు సమయం చూసి అల్లరి పెడ్తున్నాడు. లేట్ చేస్తే రేట్ పెంచుతామని ప్లాన్ - దరిద్రుడు. ఇప్పటికిలా వీడిదగ్గరకి రావటం పదోసారి. తక్కువ దూరమా? రాజమండ్రి నుంచి కొంతమూరు ఓ ఆరూ, అక్కడ్నుండీ ఈ బూరుగుపూడి మరో పది, మొత్తం పదహారు కిలో మీటర్లు. పెట్రోలు చెడ తాగుతున్నాడు. ఉదయమో సారొచ్చేను - లేడు. మళ్ళీ ఇప్పుడు. ఈసారైనా వాడు

# కోణం

**-ఆచార్య**

చెప్పిన చావు కబురు - "మనక్కావల్సిన సేవ కర్ర రాపించాల్నంటే మరో వారం పట్టుద్దండి.... అయినా ముందు పనిగానిద్దరూ... జాయ్‌గా చేసేద్దారి..." ఇద్దైనా చెప్పేసరికి చీకటి పడిపోయింది.

వాడి మొహాన్ని ఈడ్చి తందామని ఎంత అన్పించిందో నా మీద నాకు అంతలా జాలేసింది. నాన్నగారు చెప్తూనే వున్నారు - 'వాడు కాకుంటే మరొహడు. కల పకేం కొదవా?' అంటూ. నాకే అలా ఇష్టం లేదు. వీడు త్రాష్టుడే, కానీ ఆ వచ్చేవాడు మరింత త్రాష్టుడవడని భరోసా ఏమీ లేదుగదా? ఈ ఆలోచనతోనే విక్రమార్కుడి వేషం కట్టేను. ఆ బేతాళుడైనా లొంగుతాడేమో గానీ అప్పి రాక్షసుడు లొంగేలా లేడు.

అసలు నాకు బుద్ధుండాలి. ఉదయం నుంచీ ఒకటే ముసురుగా వుంది. ఇంత చీకటి పడేవరకు వాడిసొదంతా ఎవడు భరించమన్నాడు? చేతిలో బైక్ ఉందన్జెప్పి ఇలా ఇరుక్కున్నాను. ఈ చీకట్లో ఇలానే మరో రెండు మైళ్ళు దీన్ని తోస్కుంటూ పోతేగానీ మోక్షం లేదు. ఇంకా నయం రోడ్ మంచిది కాబట్టి సరిపోయింది. ఇదేదో మట్టిరోడ్డయ్యుంటే....

క్రూరంగా ఉరిమింది ఆకాశం.

బైక్‌ని లాగుతుంటే అయాసం తన్నుకొస్తోంది. మరో రెండు మైళ్ళలో కొలమూరొస్తుంది. రమ్మిగాడిది అ



వూరే. అక్కడ దీన్నుంచేసి ఏ బస్‌లోనో పోవాలి. అసలింత రాత్రపుడు బస్సులు కూడా దొరకవు. చీకట్లో ఎనిమిదో తొమ్మిదో చూపిస్తోంది వాచ్. వర్షంలో పూర్తిగా తడిసిపోయేను. వర్షం వల్ల దారి మరింత మసగ్గా కన్పిస్తూంది.

సడెన్‌గా కన్పించింది - ఎదురుగా కొద్ది దూరంలో అదేదో చెట్టు దెయ్యంలా వంగుతోంది. 'అదృష్టవంతుడ్ని చెడగొట్టేవాడూ లేడు, దురదృష్టవంతుడ్ని బాగు చేసేవాడూ లే'డనేది అమ్మ గొంతులో ఏడుపులాటిదేదో అడ్డుపడ్తోంది. గబగబా బైక్‌ని స్టాండ్ చేసి చెట్టు దగ్గరకి పరుగెత్తేను. చూస్తుండగానే రోడ్‌కి అడ్డంగా గోడ కట్టినట్టు పడిపోయింది. నేను దాటెయ్యొచ్చు కష్టపడి. బైకిని దాటించటం మాత్రం కష్టమన్పించింది. చాలా గుబురుగా వుంది. ముళ్ళు కూడా ఉంటాయేమో! 'కనుబొమలు కలిస్తే అదృష్టంరా - నువ్వు చాలా అదృష్టవంతుడివి' అని ఊరించే మా బామ్మ ముఖం భీకరంగా గుర్తొచ్చింది నాకు.

చుట్టూ చూస్తే పాడుబడ్డ బస్‌షెల్టర్ తప్ప అన్నీ పొలాలూ, చెట్లే, ఆ షెల్టరే ఈ రాత్రికి దిక్కయ్యేలాగుంది. కాళ్ళూ, చేతులూ లాగేస్తున్నాయి. షెల్టర్‌లో కెళ్ళి జాగ్రత్తగా చూసేను కళ్ళు పొడుచుకుని. కూర్చునేందుకున్న అరుగుమీద సైతం అక్కడక్కడా కారుతోంది. ఇక్కడ ఏతేలో జెర్రో నన్ను గదిమేస్తే రక్షించే నాథుడెవడు? కళ్ళు మూస్కుని కూలబడి 'రక్షమాం భగవాన్' అనుకున్నాను. టైమెంతైందో? వాచ్ తీసి చూశాను.

'నీకై వేచీ నీకై వేచీ వేసారిపోయానూ'

మనసులో పాడుకునే సరికి ఆకాశం తళుక్కుమంది. వెలుగులో నా వాచీ చూపించింది. సఫా! మరిక బస్సులుగానీ కనీసం సైకిలుగానీ వచ్చే అవకాశమే లేదు. కూలబడిపోయాను.

'ఘల్లు ఘల్లు ఘల్లుమంటు మెరుపల్లె తుళ్ళూ'

కూనిరాగం తీస్తూ పడిపోయిన చెట్టువైపు చూసిన నాకు నిజంగానే గుండె గుభిల్, జల్ జల్ మంది. పడిన చెట్టు దాటుకుని ఎవరో స్త్రీ ఇటే వస్తూంది. ఓ 'మానవస్త్రీ'కి ఇంత ధైర్యమా....?

'ఛట్, నేన్నమ్మను'

దెయ్యాల గురించి రాంకీగాడితో నేన్జేసిన వాదన గుర్తొచ్చి, గుండెమీద చెయ్యేస్కుని నాకు నేన్జెప్పేస్కున్నాను - 'నేన్నమ్మను - నమ్మను గాక నమ్మను'

ఛడేల్మని మెరిసిందింతలోనే. కాళ్ళవంకే చూస్తున్న నాకు ఆమె పాదాలు కన్పించినట్టే అన్పించింది. దడ తగ్గి, ఆలోచన్లు మొదలయ్యాయి.

ఇంతరాత్రివేళ, ఇంతవర్షంలో, ఈ దారిన - ఓ ఆడపిల్లా? క్యోం ఔర్ కైసే? ఆమె నేనున్న షెల్టర్ వరకూ వచ్చి ఆగిపోయింది.... నన్ను చూడ్డం వల్ల ననుకుంటా, కొంచెంసేపలాగే తడుస్తూ నిల్చుంది.

'ఫర్లేదు. లోనికి రండి' అన్నాను. ఓ మూలకొచ్చి నిల్చుంది మెల్లగా. చీకట్లో పోలిక తెలీటం లేదుగానీ ఎక్కడో చూసినట్టే అన్పిస్తోంది. అసలు సంగతేంటో తెల్సుకోవాలన్పించింది.

చచ్చినా నేను ఆడవాళ్ళతో సరిగా మాటాళ్ళేనట. ఓవేళ మాటాడితే తిట్టినట్టూ, ఏడిసినట్టూ ఉంటుందట. మా రమ్మిగాడూ వాళ్ళూ తిట్టేవాళ్ళు. ఎంతసేపైందోగానీ వాచ్ చూస్తే ఓ ముల్లే కన్పించింది. మళ్ళీ మెరిసేదాకా నిరీక్షణే. ఆ అమ్మాయి అక్కడే నిల్చుని బైటికి చూస్తోంది.

'ఏ ఊరయా?'

నా బైక్‌నో ఆ కూలబడ్డ చెట్టునో అడిగాననుకుందో ఏమో, మాటాళ్లేదు. మళ్ళీ కొంతసేపుండి, "ఏ వూరో' అన్నాను. ఈలోగా మెరిసింది. టైం చూసి నా ప్లేస్ కొచ్చి చిరాగ్గా కూలబడ్డాను. అటు చూస్తున్నదల్లా నావైపు తిరిగి, 'టైమెంతైందండీ?' అంది. ఏడస్తున్నట్లుంది. గొంతు వణికింది.

నాకు చెప్పాలన్పించలేదు మొదట. మళ్ళీ, టైం చెప్పి మాటల్లోకి దించి విషయం కనుక్కోవచ్చన్పించి, 'పన్నెండు దాటింది... ఏ వూరు మీది' అన్నా. ఈసారి జవాబుగా ఆమె చీరెకొంగుతో కళ్లొత్తుకుని ముక్కు తుడుచుకొంది. నాకింక మాట్లాడ బుద్ధెయ్య లేదు.

❋ ✳❋ ✳❋

**చ**టుక్కున మెలకువొచ్చింది. ఒరిగి తుప్పట్లో పడబోదును.

తల విదిల్చి వాచీ చూస్తూ నిలబడ్డాను. రెండో మూడో ఐనట్టుంది. అదే మూల కూర్చొని నావైపే చూస్తున్నట్టుంది ఆమె. దగ్గరకెళ్ళి,

'ఏ వూరెళ్ళాలండీ' అన్నాను.

జవాబు లేకుండా అలాగే చూస్తూ కూచుంది. పోనీ, మూగదా అంటే టైం ఇందాక అడిగిన గుర్తు. ఇంతలో మెరిసింది. నేననుకున్నది నిజమే. ఆమె నాకు తెలిసినదే. కాలేజ్‌లో ముందు బెంచ్‌లో కూర్చొనేది. నేను విన్న ప్రకారం ఆమెదీ కోలమూరే - రమ్మిగాడి ఊరు. ఈమే, రమ్మిగాడూ తెగ ఇదిగా వుంటున్నారని రాంకీగాడు అంటుండేవాడు. నాక్కొంచెం ధైర్యం వచ్చింది.

'చెప్పండీ. ఇక్కడికెందుకొచ్చేరూ?' గదమాయించినట్లన్నాను. మళ్ళీ ఏడుపు మొదలెట్టింది. నా ప్లేస్‌కొచ్చి చతికిలబడ్డాను.

'బాలానాం రోదనం బలం.' బాలలంటే పిల్లలే కాదుట. 'స్త్రీ'లని కూడా భాష్యం చెబుతారు.

'రమేషొస్తానన్నాడు' వెక్కిళ్ళ మధ్య అందామె.

నాకేదో అర్థమైనట్టూ కానట్టూ వుంది. 'ఎక్కడికీ - ఎందుకూ' అందామని అనుకున్నాగానీ ఆమె ఏడ్పు చూసి ఆగిపోయాను. చాలాసేపు మాటల్లేవు.

'టైం.....' అంది ఏడుపునాపుకుంటున్నట్లుగా - కొంతసేపటికి. మూడు దాటుంటుందన్నాను. అంతే దిగ్గున లేచి బైలుదేరింది.

ఇదంతా ఏదో కలలాగా వుంది నాకు. చిత్రంగా వుంది. ఆమె పేరు వల్లి అని గుర్తు. మా వాళ్ళు 'వళ్ళీ' అనే వారు. చెట్టువరకు వెళ్ళి, మళ్ళీ ఏదో గుర్తొచ్చినట్టు వెనక్కొచ్చింది.

'నన్నిక్కడ చూసినట్లు ఎవరికీ చెప్పొద్దండీ' చేతులు జోడించింది. ఏం అనాలో తోచలేదు. చూస్తుండగానే ఎలా వచ్చిందో అలానే వెళ్ళిపోయింది.

❋ ✳❋ ✳❋

**అ**ప్పిగాడి దయవల్ల మా ఇల్లు ఇప్పటికీ పూర్తవ లేదా కొంతమూర్లో. ఇక్కడ రాజమండ్రిలో మా ఎదురింటి వాళ్ళు మా కన్నా వెనక మొదలు పెట్టి ఇవేళ ఉదయమే గృహప్రవేశం కార్డిచ్చి వెళ్ళేరు.

మధ్యాహ్నం భోజనానికి అక్కడకే బైలుదేరేను. ఇంటాయన తెల్సినవాడే. ఈ మధ్యనే పెళ్లైంది. సాదరంగా ఆహ్వానించి ఇల్లంతా చూపించాడు. డాబాపైన భోజనాలట. భార్యని పరిచయం చేస్తానంటూ డాబాపైకి దారి తీశాడు. 'మీరిద్దరూ క్లాసు మేట్సంట గదండీ - మా వొల్లి చెప్తుంటాది' అంటున్నాడు.

మళ్ళీ ఆమెనింత త్వరగా కలుస్తాననుకోలేదు. వర్షం రోజు తర్వాతి కథ తెల్సుకోటానికి రమేష్ కూడా ఆ తర్వాత కనపడ్లేదు. వడ్డన కార్యక్రమం చూస్తున్న వల్లి నన్ను చూసి హడావిడిగా ఎదురొచ్చింది. అప్పటి వల్లికీ ఈమెకీ చాలా తేడా కన్పించింది. పెద్ద తరహాగా వుంది. తన కథని ఎలా ఇప్పుడెత్తాలా అని పెద్ద ఆలోచన్లో పడ్డాను. అలాగే భోజనం పూర్తైంది. తాంబూలం తీస్కుని అక్కడే అలా నిలబడ్డాను. ఆమె భర్త కలివిడిగా అటూ ఇటూ తిరిగేస్తున్నాడు. నేను ధైర్యం చేసి ఆమెని సమీపించేను.

"ఏమీ అనుకోనంటే... రమ్మీ... అదే రమేష్ ఏమయ్యాడు?" బెరుగ్గా నా బాణీలోనే అడిగాను.

'చెప్పాలా, వద్దా' అన్నట్టు చూసి నెమ్మదిగా మొదలెట్టింది.

"ఆ రోజుకి... అంటే... ఆ వర్షం రాత్రికి తర్వాత రెండ్రోజులకి నాకు ఈయనతో నిశ్చితార్థం వుంది... అందుకే నేనూ రమేష్ వైజాగ్ పారిపోదాం అనుకొన్నాం."

'మామూలే' అనుకున్నాను. పైకి అన్లేదు.

"రమేష్ పదింటికల్లా వచ్చేస్తానన్నాడు. మూడింటిలోపు తిరిగి నేను ఇంటికెళ్ళిపోతే నేనలా వచ్చిన విషయం ఎవరికీ తెలీదు. అందుకే అంతవరకు చూసి, ఇంటికెళ్ళిపోయాను."

"మరి రమేష్?"

"మర్నాడు సాయంత్రం కన్పించాడు - చెరువు దగ్గర. ముందు రోజు తనూ వచ్చాడుట." దూరంగా వాళ్ళాయన రావటం కన్పిస్తోంది. "నాతో పాటు ఎవరో ఉండటం చూసాడట..." అతను దగ్గరవటంతో ఆగింది.

నాకర్థమైంది. పిరికి రాస్కెల్. అంత పిరికి వాడు ఇంతకెలా తెగించినట్లు? మధ్యన ఈమె ఎంత ధైర్యం చేసింది? ఆమెతో పాటు మరొకడ్ని చూసేసరికి బెదిరిపోయేడు. ఇంక వాడిమీద ఈమెకిలా నమ్మకముంటుంది? తనని జీవితాంతం రక్షించగలడని ఎలా నమ్ముతుంది? మరోలా చూస్తే రమ్మీది కొంచెం ముందు చూపన్పిస్తుంది. ఆమెతో పాటుగా వున్న వ్యక్తిని ఎదిరించి, ఆమెని తీసుకొనిపోయే వీలు అక్కడ లేదు కాబట్టి తను బైట పడడం క్షేమం కాదని అనుకొని వుండవచ్చు. అలాగైతే వల్లిది తొందరపాటు చర్యే అవుతుంది.

"వస్తానండీ" వాళ్ళాయన్ని ఉద్దేశిస్తూ అన్నాను.

"ఉండండుండండి. మా అమ్మని పరిచయం చేస్తా" అంటూ ఓ ముసలావిడవైపు వెళ్ళాడు. నేనూ అతన్ని అనుసరించబోయాను.

"ఆరోజు చెరువు దగ్గర రమేష్ ఏమన్నాడో తెల్సా" వెనుక నుంచి అందామె. వెళ్ళబోయిన వాడ్ని, ఆమె వైపు తిరిగాను.

"నీతో బాటూ వున్నవాడెవడూ... రెండింటి దాకా... ఆ రాత్రిలో... అన్నాడు."

ఆమె తీస్కున్న నిర్ణయం మీద ఆలోచించేందుకు నాకు రెండో కోణం కన్పించలేదు. ❑